# గంగాపుత్రులు

బెంగాలీ మూలం: మహాశ్వేతాదేవి

తెలుగు సేత: భాగవతుల కృష్ణారావు

ఆ రోజు మకర సంక్రాంతి.

మోలిండో పవిత్ర గంగా నదిలో అప్పుడే స్నానం చేసి బట్టలైనా మార్చుకోలేదు— మున్సిపాల్టీ వారి బంట్రోతు బాబూలాల్ వచ్చాడు, చేతిలో ఒక నోటీసు.

''ఏయ్! ముసలోడా! నువ్వీ జాగా ఖాళీ చెయ్యి. ఇదిగో నోటీసు.''

మోలిండో అవాక్కయ్యాడు.

''ఏమిటీ...నేను...ఖాళీ...''

''ఆహా! నువ్వే ఈ స్మశానాన్నొదిలేసి ఎక్కడికైనా వెళ్ళిపోవాల్సిందిగా ఉత్తర్వు జారీ చేస్తూ మున్సిపాల్టీ వారిచ్చిన ఆజ్ఞాపత్రం. ఎందుకంటే ఈ స్థలంలో స్మశానం పొడిగిస్తూ చనిపోయిన వారి వెంట వచ్చిన బంధువులు వుండేందుకు వీలుగా ఓ షెడ్డు నిర్మిస్తారు. వారి వెంట తీసుకొచ్చిన కర్రలు అవీ వుంచడానికి అందులో ఒక భాగం కేటాయిస్తారు. ఇహ పోతే టీ కొట్టొకటి, సారా దుకాణం ఆ పక్క జాగాలో వుంటాయి.''

మరి...మరి...మేం...గంగ పుత్రులు ఎక్కడికి పోతాం?''

భుజాలెగరేసి అన్నాడు బాబూలాల్— ''ఏమో.''

''హే...బాబూలాల్...వుండుండు. ఈ ఐదూ వుంచు. ఆ నోటీసు పట్టుకుపో.''

''అదేం కుదర్దు. తప్పనిసరిగా నువ్వీ జాగా ఖాళీ చెయ్యాల్సిందే'' దాదాపు పరిగెడుతున్నట్టుగా పోయాడు బాబూలాల్.

శిథిలావస్థలో వున్న గుడిశె రాటని పట్టుకు నిస్తేజంగా నేలకూలిపోయాడు మోలిండో.

''ఓ గంగభవానీ! మకర వాహినీ! తల్లీ! ఇన్నేళ్ళుగా నిన్నే నమ్ముకుని, నీకు పూజలు చేసి జీవితం వెళ్ళ మారుస్తున్న నన్ను, నీ కొడుకని ఇలా నడివీధిలోకి పంపడం నీకు న్యాయమేనా? నేను చేసిన పాపం ఏమిటి?''

మోలిండో భార్య దాసి అప్పుడే గుడిశెలో కడుగు పెట్టింది. ''ఏమైంది? అలా కూలబడ్డావేం?''

భార్యవంక నిర్లిప్తంగా చూసేడు.

''అంతా అయిపోయింది... గంగా భవానీకి, మనకీ రుణం తీరిపోయింది.''

దాసి దిగ్భ్రాంతితో అడిగింది— ''ఏమిటీ...ఏమిటి నువ్వంటున్నది.''

''బాబూలాల్ వచ్చేడు. స్మశానాన్ని పెద్దది చేస్తున్నార్ట. మనం దీన్నొదిలి పోవాల్ట.''

''భగీరథ్'' కొడుకుని బిగ్గరగా పిలుస్తూ పరిగెట్టిందామె.

భగీరథ్ స్కూల్లో కొద్దిపాటి చదువు చదివి ప్రస్తుతం పొట్టకాలు మదన్ దగ్గర సారా కొట్లో పనిచేస్తున్నాడు. బాగానే సంపాదిస్తున్నాడు. అప్పుడప్పుడూ తల్లితో— ''నువ్వీ పందుల్ని పెంచడం మానెయ్యి. లేదా నేను మా మావగారి దగ్గరకు పోయి నా సంపాదన నేను చూసుకుంటాను'' అని బెదిరిస్తూ వుంటాడు. ప్రస్తుతం వాడి పెళ్ళాం పుట్టింట్లో వుంది. ఆమె తండ్రి మున్సిపాల్టీలో స్వీపరు. ఆమెకి స్మశానంలో కాపురం ఇష్టంలేదు. ఆ కాలుతున్న చితుల మధ్య, శవాల్తో సహవాసం నచ్చక భర్తతో ఎన్నోసార్లు వేరుకాపరం గురించి పోరుపెట్టింది.

అయితే ఎవర్నీ నొప్పించడం ఇష్టం లేని భగీరథ్ తటస్థ వైఖరి అవలంబించాడు.

తల దువ్వుకుంటున్న కొడుకు తల్లి మాటలు వింటూ నిశ్శబ్దంగా ఆలోచనలో మునిగిపోయాడు.

కాసేపటకి—

''మనల్ని ఖాళీ చెయ్యమనడానికి వీళ్ళకేం అధికారం. వీళ్ళేమైనా ఈ స్థలాన్ని మనకిచ్చేరా!'' అన్నాడు.

''అంతేకాదు. ఆ బాబూలాల్‌గాడు మీ నాన్నిచ్చిన ఐదు రూపాయిలు కూడా తీసుకోలేదు తెల్సా!''

''ఏమిటీ! మున్సిపల్ ప్యూన్ డబ్బు నిరాకరించాడా - అయితే మనకి నిజంగానే చెడ్డ రోజులు వచ్చాయన్నమాట.''

''వెళ్ళు. వెళ్ళి మీ నాన్ననోసారి చూడు.''

ఎదురుగా నిలబడ్డ కొడుకు వేపు ఎర్రబడ్డ కళ్ళతో చూసాడు మోలిండో.

''నాన్నా...'' ఏదో అనబోతూ ఆగిపోయాడు.

''భగీరథ్'' వణుకుతున్న స్వరంతో అన్నాడు మోలిండో— ''భగీరథ్... మన పాపాలు... గంగపట్ల మనొనర్చిన పాపం...నేను చేసుకున్న పాపం నోటీస్ రూపంలో మనల్ని శిక్షిస్తున్నాయి. లేకపోతే తల్లి గంగ నుంచి మనల్ని విడదీయడమేమిటి.''

''మనమే పాపం చేసాం.''

''నువ్వు మన వంశాచారం ప్రకారం నడవక ఆ మదన్‌గాడి సారాకొట్లో పన్చేయడం గంగమ్మ తల్లికి కోపం తెప్పించి వుంటుంది. నేను...నేను కూడా పాపమే చేసేను. మన పూర్వులు పాముకాటుతో చని పోయేవారని గంగలో వదిలేవారు. మరి ఈనాడో... లోకం మారిపోయింది. అందరికీ దహనం. లేదా పూడ్చటం. తెలిసీ కూడా నేను దహనం చేసేవాణ్ణి. నేనేం చెయ్యగల్ను... వాళ్ళ బంధువులు ఎలా చెప్తే అలా.''

''నాన్నా... పద మనం బడాబాబు (పెద్ద అధికారి) దగ్గరికి వెళ్దాం.''

అప్పుడు దాసి కలగజేసుకుంది.

''నిజమే. వెళ్ళు ముసలాయనా! ఆ బట్టలు మార్చుకుని, ఇంత తిని వెళ్ళండి. వాళ్ళు మనల్ని పొమ్మనకుండా ఆయనే ఏదో చెయ్యగల్డు.''

*** ** ***

మోలిండో బట్టలు మార్చుకుని స్మశానం పక్కనే వున్న గంగ ఒడ్డున మెట్లమీద కూర్చున్నాడు. ఆ నీటి శబ్దం...ఇన్నాళ్ళుగా దానిలో వున్న సాహచర్యం...గతం... గంగని తనకన్నా తల్లిగా భావించాడే కానీ ఎన్నడూ దాన్నో నదిలా చూడలేదు.


కొడుకు గతాన్ని మరిచిపొమ్మని ఎన్నిమార్లో చెప్పేడు. కానీ అది తనకు సాధ్యం కాదు. పాపిష్టి వర్తమానంకన్నా తీయనైనది ఆ గతమే.

మళ్ళీ కొడుకుతో వాగ్యుద్ధం కళ్ళముందు కదలాడింది.

''నువ్వు చెప్పేదంతా నిజమని ఎలా అనుకుంటు న్నావు? ఎక్కడైనా రాసి వున్నట్టు రుజువుందా? ఎవరో

నీకు చెప్పేరు. నువ్వు నమ్ముతున్నావు."

"పిచ్చివాన్నా! రాసినదంతా నిజమనుకుంటున్నావా? చదువుకోని మావాళ్ళలో అనుశ్రుతంగా వస్తూన్న ఆ కథలు, చాలా బలీయంగా మా రక్తంలో చోటుచేసుకున్నాయి. అవి కథలుకావు. వాస్తవంకన్నా ఎక్కువగా నమ్మదగ్గ నిజాలు. చాలా కాలం క్రిందట ఒక శ్రావణ రాత్రి మకరవాహిని గంగ మన పూర్వీకుడైన కాలుకి ప్రత్యక్షమై తనవెంట వున్న దాసిని అతనికి సమర్పించి తన వొడ్డునే నివాసమేర్పరచుకొని కాపురం చెయ్యమని కోరింది. తను వారికి రక్షణ కల్పిస్తానన్నది. శ్మశానంలో



కాటికాపరిగా విధ్యుక్తధర్మాన్ని నిర్వహించమన్నది. ఘోరున కుండపోతగా కురుస్తున్న వర్షంలో నాలుగు చేతులెత్తి తననేసే చూస్తున్న ఆ జంటను ఆశీర్వదిస్తూ ఒకానొక రాజు భృత్యుడిగా మన వంశంలో పని చేస్తాడని సెల విచ్చింది. హరిశ్చంద్ర చక్రవర్తి ఆ ప్రకారంగానే మన కాలుడి కింద భృత్యుడిగా కొంతకాలం పని చేసాడు. తరువాత కాలవశం తీరి తిరిగి సింహాసన మెక్కాక మన కాలుడు అతనిని కలుసుకుని తనకేదైనా దానమిప్పించ మని కోరినప్పుడు ఆ చక్రవర్తి తన పాత దాస్యపు రోజులు గుర్తుంచుకుని సమస్త పృథ్వీమండలంలోని మరుభూములన్నీ కాలుడికి దానమిచ్చి మన వంశీకు లందరూ ఇదే వృత్తి కొనసాగించాలని ఆదేశించాడు.

కాలుడు ఆ దానం పొందాక ఆనందంతో నృత్యం చేస్తున్నప్పుడు గంగవొడ్డున మరిన్ని మరుభూములు పుట్టు కొచ్చేయి. అదంతా అప్పటి వైభవం. ప్రస్తుతం కాలుడి వంశంలోని వాడైన మోలిండో గ్రామాధిపతి, జమీం దార్ చరణ్‌బాబు మోలిండో తాతకు దానమిచ్చిన ఈ మరుభూమిని తన సర్వస్వంగా భావిస్తూ గంగ వొడ్డునే తన జీవితం వెళ్ళబుచ్చుతున్నాడు.

అంతలో ఈ దుర్ఘటన.

మోలిండో ఆలోచనలింకా తెగలేదు. తనేనాడు చనిపోయిన వారి బంధువుల్ని పీడించ లేదు. వారెంత ఇస్తే, ఏదిస్తే అదే తీసుకునేవాడు. చేస్తున్న వృత్తిని చాలా పవిత్రంగా భావించేవాడు.

అయినా ఈ రోజు —

మోలిండో ఆలోచనలు కాళీమందిరంలోని సాధువు వేపు మళ్ళాయి. శ్మశానం పక్కనేవున్న కాళీమందిరంలో వుండే సాధువు నిజానికి కాళీభక్తుడు కాదు. ఆ మందిరంలోని కాళీమాత నగలమీద ఆశతోనే అక్కడున్నాడు వాడు. ఎప్పుడూ గంజాయి తాగుతూ, ఆ సారాకొట్టు

మదన్‌గాడితో సహవాసం చేస్తూ రోజులు గడిపే ఆ వెధవకి ఏ బాధాలేదు.

పవిత్ర గంగా మాతని నమ్ముకున్న తనకే ఇంత కష్టం. తనకున్నదల్లా కొద్దిపాటి ఈ జాగా, ఐదారు పందులు, రెండు మామిడిచెట్లు.

"ఏవిటాలోచిస్తున్నావు మోలిండో" -కాళీమందిరం తాలూకు సాధువు దగ్గరగా వస్తూ ప్రశ్నించేడు.

మోలిండో తలెత్తి సాధువుకేసి చూసేడు. పీలగా ఎర్రబడ్డ కళ్ళతో వాకింత జోగుతూ గాలికెగుర్తున్న నిడుపాటి బట్ట గెడ్డాన్ని వేళ్ళతో దువ్వుకుంటున్న సాధువు వేపు అసూయగా చూసేడు.

"నీకేం పోయింది భాయి. నిన్నెవడూ అడిగేవాడు లేడు. నీ వునికి ఎవర్నీ బాధించదు. నా పరిస్థితి చూడు. పెనంమీద పేలగింజలా వున్నాను."

నక్కలు వూళవేసినట్టు నవ్వేడు సాధువు.

"ఇవాళ బాబూలాల్ వచ్చి నోటీస్ ఇచ్చిపోయాడు. తరతరాల్నించి స్థిరంగా వుంటున్న మాకు ఈ భూమ్మీద ఏమాత్రం హక్కు లేదంటావా?"

సాధువు చిద్విలాసంగా చూస్తూ అడిగేడు—

"నీకు హక్కున్నట్టు దాఖలుపరిచే పత్రాలేమైనా నీ దగ్గరున్నాయా?"

"పత్రాలా...?"

"ఆహా...పత్రాలే"

మోలిండో నిస్పృహగా చూసేడు అతని వేపు.

"అప్పట్లో గంగ వొడ్డంతా అరణ్య ప్రాంతం. మా పూర్వీకుడ్ని చరణ్‌బాబు పూర్వీకులు పిలిచి ఈ శ్మశాన భూమికి కాపరిగా నియమించారు. తరతరాలుగా మేమి లాగే కొనసాగుతున్నాం. నీకా కథంతా తెలుసుగా."

"అప్పట్లో ఈ పట్టణం ఇలా వుండేదా?"

"లేదే. అప్పటికి ఇప్పటికి చాలా మార్పు వచ్చింది. సినిమాహాళ్ళు, వూరువూరంతటికి కరెంటు, దుకాణాలు, పట్టణానికి పోయేందుకు బస్సు రోడ్డు...ఇంకా... అప్పట్లో ఇంత జనాభా ఎక్కడిది. రాత్రి శవం శ్మశానానికి వస్తే బుడ్డి దీపాల్తో వచ్చేబాధగా వుండేది.

## కవిత

ఊపిరాడడం లేదు.
ఉక్క పోస్తోంది ఏ.సి. గదిలో
కారణం తెలిసిపోయింది
కవిత రాయలేదు ఇవాళ.

— డాక్టర్ సి.నారాయణరెడ్డి

నక్కల్నీ, ఇతర జంతువుల్ని తోలేది మహాబాధగా వుండేది."

"మరి...ఇన్ని విషయాలు తెలిసికూడా మూర్ఖంగా ఆలోచిస్తావేం. కాలం మారింది. పరిస్థితుల కనుగుణంగా మనమూ మారాలి" గొంతు తగ్గించి మెల్లగా అన్నాడు సాధువు.

"నీకో రహస్యం చెప్పనా! అసలు ఈ తతంగమంతా దేనికో తెలుసా! మున్సిపల్ ఎన్నికలు దగ్గర కొస్తున్నాయి. ప్రజల్ని మంచి చేసుకోవాలి. రోడ్లు కొత్తగా వేయించడం మాటటుంచి ప్రస్తుతం అధ్వాన్నంగా వున్న వాటిని బాగుచేసే కార్యక్రమం చేపట్టమని ప్రజలు గోలపెడుతున్నారు. ఇహపోతే వినయ్‌బాబు పేదలకోసం ఇళ్ళు కట్టించడానికని చరణ్‌బాబు మామిడి తోట అడుగుతున్నాడు. శ్మశానం మరింత పెద్దదిగా చెయ్యడానికి, దీని చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టించడానికి, ఓ పక్కగా కర్రలు మొదలైన అవసర సామగ్రి వుంచేందుకు వీలుగా ఓ షెడ్డు నిర్మించడానికి వాళ్ళు పూనుకున్నారు. అందులో భాగంగా, ముందస్తుగా నీకు నోటీసు పంపేరు. కాబట్టి గత వైభవాన్ని మర్చిపో. వర్తమానంలో అడుగుపెట్టు."

"మరి నీ విషయం? నిన్నెవరూ ఖాళీ చెయ్యమన్లేదే?"

సాధువు బిగ్గరగా నవ్వేడు. ఆ నవ్వు కొన్ని వందల నక్కలు మూకుమ్మడిగా వూళవెట్టినట్టుంది.

"నన్నా! నన్ను ఖాళీ చెయ్యమనేందుకు వాళ్ళకు ధైర్యమెక్కడిది. శ్మశాన కాళీ అంటే తమాషా కాదు. అదీ కాక ఆ మదన్‌గాడున్నంత వరకూ నాకేం ఢోకా లేదు."

మోలిండో నిట్టూర్చేడు. అంతే! నెనకో అండ లేకపోతే బతుకింతే. ఎవడెలాతంతే అలా పడవల్సిందే బంతిలా.

"ఓ అన్నా...ఓ అన్నా...రారా...పార్టీ వచ్చింది" రఘు పిలుస్తున్నాడు.

కొడుకు భగీరథ్ సారాకొట్లో పన్చేస్తున్న దగ్గర్నుంచీ ముసలి మోలిండో తనకు సహాయంగా రఘుని పెట్టుకున్నాడు. వాడు గనక లేకపోతే మోలిండో ఈ పని నిర్వహించడం చాలా కష్టమయ్యేది.


మోలిండో లేచేడు నిస్పత్తువుగా—


"గంగామాతా! నేను చెయ్యబోయే ఆఖరి దహన కార్యక్రమం ఇదే కాబోలు. నామీద దయలేదు నీకు" మనసులో గొణుక్కుంటూ ముందుకి నడిచేడు.

*** ** ***

బడాబాబు దగ్గర నిలబడ్డాడు మోలిండో తన గోడు వెళ్ళబోసుకున్నాడు దైన్యంగా.

"నిజమే మోలిండో! నువ్విచ్చిన పందిమాంసం, మీ వాడు సరఫరా చేసిన సారా బాగా తాగేను నేను. నీకొచ్చిన కష్టానికి నేను కూడా బాధపడుతున్నాను. కానీ మరి రూల్సు... వినయ్‌బాబు బావమర్ది కంట్రాక్టరు. వాడు మదన్‌గాడితో కల్సి పెట్టబోయే సారాషాపు కోసం నీ జాగా త్యాగం చెయ్యాల్సిందే. చరణ్‌బాబు నీకు దానమిచ్చిన భూమి మా పరిధిలోనిది. అదీకాక నీ కిచ్చినట్లు దాఖలైన పత్రాలు నీ దగ్గరలేవు. న్యాయం నీ వేపు లేదు. నాకు నీ పట్ల బోలెడంత సానుభూతి వుంది. కానీ నా



చేతులు కట్టేసున్నాయి. నా నోటికి తాళం బిగించేరు. నేనేం చెయ్యగల్ను. నీ కథలు వినడానికి చాలా బావు న్నాయి. కాలూ గంగపుత్రుడు...రాజా హరిశ్చంద్ర చక్రవర్తి...గంగామాత...కానీ...మేము... రూల్సు... ఎలక్షన్...వినయ్‌బాబు...ప్రజోపయోగం......''
ఇదంతా బడాబాబు పైకనలేదు. మనసులో అను కున్నాడు.

''దొరా! నాకన్యాయం జరిగిపోతున్నాది'' మోలిండో ఆవేదనగా అన్నాడు.

''ఏం చేస్తాం మోలిండో. నీకోసం వందలాది ప్రజల అభ్యర్థన మున్సిపాల్టీ తోసిపుచ్చలేదు కదా! మొన్నటికి మొన్న ప్రజలు ఎంత గొడవ చేసారని.''

మోలిండో కొద్దిగా కోపంగా అడిగేడు ''ప్రజల కోసమే అయితే రోడ్లు బాగుచేయించవచ్చుగా లేదా వీధి దీపాలు పెట్టించవచ్చుగా...మంచినీటి సౌకర్యాలు కల్పిం చవచ్చుగా నామీద పడటం దేనికి.''

''అవన్నీ చేస్తున్నాం...చేస్తున్నాం... తొందరపడితే ఎలా? ఇంకో విషయం ఆ చరణ్‌బాబు వంశంవాళ్ళు మంచివాళ్ళు కాబట్టి నిన్నక్కడ వుంచారు గానీ లేకపోతే...'' మధ్యలో అందుకున్నాడు మోలిండో ''ఒకరు మాకిచ్చేదేమిటి. ఆ గంగా భవానీ మాకు స్వయంగా భూమిని ప్రసాదించింది.''

నవ్వేడు బడాబాబు ''అయితే... అయితే... ఆ గంగాభవానీనే అడుకోమను.''

మోలిండో కళ్ళు జలపాతాలయ్యాయి. అది ఏడుపు కాదు. తన విశ్వాసం...నమ్మకం...జీర్ణించుకుపోయిన సంప్రదాయం తన కళ్ళముందే ధ్వంసమవుతూంటే ఆ ముసలి వ్యక్తి గుండె లోతుల్లోంచి పైకుబికిన గంగా ప్రవాహమది.

బడాబాబు కొద్దిగా చలించేడు—

''ఏడవకు మోలిండో! నా చేతిలో ఏమీ లేదు. నీ

## మార్పు

మిన్ను విరిగి
మీద పడ్డా
చలించలేదప్పుడు
మింటినంటిన
ధరల్ని చూసి
మూర్ఛపోయానిపుడు

-అడుసుమల్లి ప్రభాకర్.

కథ హృదయ విదారకమైనదే. జాలి తప్ప మరే సాయం నీకు చెయ్యలేను. నా పూర్తి సానుభూతి నీకే. నేను వినయ్‌బాబు, మదన్‌ల చేతిల్లో పావికని. వాళ్ళెలా ఆడిస్తే నేనలా ఆడాలి. నీ పురాణ కథల్ని వినేవారు ఎవరూ లేరు. వాళ్ళకి నీ హక్కుని దాఖలుపరిచే పత్రాలు కావాలి.''

''అంతేనా''

''అంతే!''

''చరణ్‌బాబు ఈ విషయంలో ఏమీ చెయ్యలేరా?''

''ఆయనా పెద్దవాడయిపోయాడు. అతని చేతిలో అధికారమేమీ లేదు. ఏం చెయ్యాలన్నా వినయ్‌బాబే చెయ్యాలి.''

వినయ్‌బాబు చాలా ప్రయత్నిస్తున్నాడీసారి ఎలక్షన్లో గెలవడానికి. ఈసారి అతని కల్లబొల్లి కబుర్లు ఎవరూ నమ్మడంలేదు. పాడైపోయిన రోడ్లని బాగుచేయించ లేదనీ, డబ్బుని దుర్వినియోగపరుస్తున్నాడనీ, అతని బావమర్దికోసం పిల్లల పార్కులో ఓ భాగం గోడౌన్‌గా మార్పించాడనీ ఆరోపణలున్నాయి. ఈసారి ప్రజల మద్దతు సంపాదించడంకోసం శ్మశానాన్ని ఎరగా వాడు దామనీ అతని ఆలోచన.

మోలిండోని చూస్తూనేచిరాకుపడ్డాడు వినయ్‌బాబు. సోదంతా వెళ్ళబోసుకున్నాడు మోలిండో.

''వూరుకోవయ్యా! నీ ముసలి చాదస్తాలూ నువ్వూనూ. మీలాంటి వాళ్ళే ప్రగతికి ఆటంకాలు. ఏదో నలుగురికీ మంచి చేద్దామనుకున్నా మీరు సాగ నివ్వరు. ఆ జాగా నువ్వేమైనా కొన్నావా? రాజట, హరి శ్చంద్రుడట...గంగాభవానిట... ఎవరికి కావాలి ఈ పోచికోలు కబుర్లు. ఇదేమైనా పురాణ కాలమా? చంద్రుడి మీదకి వెళ్ళొచ్చేసి, గుండెల్ని మార్చేసి, సృష్టికి ప్రతి సృష్టి చేసే కాలంరా నాయనా? మరంచేత నువ్వద్దు తగలక ఖాళీ చెయ్యి'' నిర్మొహమాటంగా దులిపేసాడు.

మోలిండో వెంట వచ్చిన భగీరథ్ కోపాన్ని ఆపుకో లేకపోయాడు.


''మరయితే మమ్మల్ని ఎక్కడికి పొమ్మని మీ వుద్దేశ్యం?''


వినయ్‌బాబు భగీరథ్ నోసారి చూసేడు.

''నువ్వు...మదన్ దగ్గర పనిచేస్తున్నావు కదూ?''

తల వూపేడు. వినయ్‌బాబు కోపం తగ్గింది. ఎందు కంటే మదన్‌తో సంబంధాలు చెడటం ఆయనకిష్టం లేదు. మెల్లగా అన్నాడు. ''చూడు భగీరథ్! మీ నాన్నకి సర్దిచెప్పు. తన ముసలి నమ్మకాన్ని వదులుకొని ప్రస్తు తానికి ఖాళీ చెయ్యమను. ఇదిగో ఈ ఎక్షన్ల గొడవ తగ్గాక నేనేదో చూస్తాను మీకోసం.''

భగీరథ్ ఏదో అనబోతుండగా లోపల్నుంచి సత్య



సాయిబాబా భజనల రికార్డు వినిపించింది. వినయ్‌బాబు లేచి లెంపలు వేసుకుని తల ముమ్మారు వేలకొనించి "ఇహ మీరు వెళ్ళండి. నాకు పనుంది. వారంలోగా ఖాళీ చెయ్యండి" అన్నాడు.

"పద నాన్నా!"

తండ్రీ కొడుకులు నిశ్శబ్దంగా వెళ్ళిపోయారక్కడ్నుంచి. బయటకొచ్చాక "నువ్వెళ్ళు భగీరథ్! నేను చరణ్‌బాబు దగ్గరకు వెళ్ళొస్తాను" అన్నాడు మోలిండో.

భగీరథ్ జాలిగా చూసి తలవూపి వెళ్ళిపోయాడు.

*** ** ***

మోలిండోని చూసి చరణ్‌బాబు కూడా చాలా కోపం తెచ్చుకున్నాడు. ఆ రోజు చాలా పవిత్రమైన రోజు. పూజలవీ జరుగుతుండగా ఈ ముసలి కాటికాపరి సరాసరి ఇంటికొచ్చేదం ఆయనకి చాలా కోపం తెప్పించింది. నిజానికి మోలిండో శ్మశానం నించి నడిచొచ్చిన దయ్యం మాదిరిగా వున్నాడు ఈ తిరుగుడి నుంచి.

"దండాలు దొరా."

"ఎందుకొచ్చా విక్కడికి?"

చెప్పేదు ఓపిగ్గా. అంతా విని "నేనేం చెయ్యగల్ను" అన్నాడు.

"దొరా! ఈ భూమి మీ తాతలు మా తాతలకి దానంచేసేరు. మేం తరతరాలుగా అక్కడే వుంటున్నాం. మా మీద దెబ్బతీయడం ఏమైనా న్యాయంగావుందా?"

"మా తాతలు చేసిన దానానికి ఫలితం నేననుభవిస్తున్నాన్లే. మున్సిపాల్టీవారు దాన్ని లాక్కున్నారు. నేనేం చెయ్యగల్ను."

"దొరా నన్ను...నన్ను ఎక్కడికి పొమ్మంటారు?"

"నన్నేం చెయ్యమంటావురా అయితే."

"దొరా! మీకు గంగొడ్డున కొంత భూమి వుంది కదా! నాకు కొంచెం ఇప్పిస్తే... ఆ గంగమ్మ ఒడ్డునే మీ పేరు చెప్పుకుని నా జీవిత శేషాన్ని వెళ్ళమారుస్తాను."

'శిక్ష'

సాంప్రదాయ కణ్వాశ్రమంలో శకుంతలలా
నీవు—
వరకట్న సింహాసనంపై దుష్యంతునిలా
నేను—
'పోస్టల్ డిపార్ట్‌మెంట్' దుర్వాసుని చేతిలో
'మన ప్రేమ'

— ఏనుగు కిశోర్‌బాబు

చరణ్‌బాబు సూటిగా చూసేడు. ముసలి వెధవ. వీడి కొడుకు ఆ మదన్‌గాడి దగ్గర పన్చేస్తాడు. అంటే ఇదంతా ఆ వినయ్‌గాడి కుట్రన్నమాట. లేకపోతే గంగ ఒడ్డున ఎనిమిదెకరాల స్థలం తను ప్లాట్ల రూపంలో అమ్మబోతున్నట్టు వీడికెలా తెలుస్తుంది. బాంకు లోను కూడా శాంక్షనయింది. హు... వినయ్‌గాడి ఆటలు తన దగ్గరా!

"ఒరేయ్! నువ్వు ముందిక్కడ్నుంచి బయటకు నడు. నీవల్ల నాకొచ్చిన నష్టం చాలు. మరి నువ్వు నన్నుద్ధరించక్కర లేదు. కథలు చెప్తాడు కథలు."

మోలిండో గాజుకళ్ళతో చూస్తుండిపోయాడు. అయిపోయింది. వాడి చెవుల్లో హోరు...ఘోష... ఎక్కడో పడిపోతున్న అనుభూతి...కళ్ళముందు చీకటి వలయాలు... తన నమ్మకాలు పేకమేడల్లా కూలిపోతుండగా లేని శక్తిని తెచ్చుకుని నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

*** ** ***

"నాన్నా"

"ఊ..."

"మన జాగాలో వున్న రెండు మామిడి చెట్లనీ మదన్ కమ్మేద్దాం. మన నష్టాల్ని కొంతవరకైనా పూడ్చుకోవాలి కదా!"

"నాకేం చెప్పకు" మోలిండో తన చివరి గంటల్ని గంగ వడ్డున గడిపేస్తూ అన్నాడు.

భగీరథ్ మదన్‌కి ఆ రెండు చెట్లూ అమ్మేసి రెండు వందలు రాబట్టేడు.

"నువ్వు కాబట్టి ఇదైనా ఇస్తున్నా. ఇంకా ఆ మున్సిపాల్టీని తడపాలి ఇదంతా నా స్వాధీనం చేసుకోవడానికి."

దాసి వున్న మూడు పందుల్ని అమ్మేసింది.

కొడుకు వాళ్ళని కూడా తన వెంట మావగారింటికి రమ్మన్నాడు. మోలిండో తను రానన్నాడు. కావలిస్తే తల్లిని తీసికెళ్ళమన్నాడు. దాసి వప్పుకోలేదు. తను మోలిండోని వదలనన్నది.

"ఇంతకీ ఎటుపోవాలని నీ వుద్దేశ్యం?" కొడుకడిగేడు.

మోలిండో స్వరం నెమ్మదిగా వుంది. ఏదో దూర తీరాల్నించి మాట్లాడుతున్నట్లు గమ్మత్తుగా, వింతగా వుంది. మనిషే అదోలా వున్నడతనీ సమయంలో.

"ఇల్లూ వాకిలీ లేని చాలా మంది ఎక్కడుంటారో తెలీదా నీకు. రైల్వే లైను పక్కన గుడిశెల్లో వుంటారు. అక్కడ నిన్ను పత్రాలకోసం పీడించే వెధవలెవరూ వుండరు. మేము అక్కడే స్థిరపడాలనుకుంటున్నాం. ఇంకా ఎన్నాళ్ళుంటాం కనక. గంగమ్మ నొదిలాక వచ్చిన వాళ్ళతో సమానం..." ముసలి మోలిండో కళ్ళల్లో నీళ్ళు.

లేచి నడిచేడు భార్య తోడురాగా. ఇద్దరూ నడుస్తున్నారు తూర్పువేపు.

వాళ్ళ నడక పాతగతంలోంచి... పురాణాల్లోంచి... వర్తమానంలోకి... ప్రయాణిస్తోంది.

వాళ్ళు వేసే అడుగులు తన గుండెల మీద పడుతున్న సమ్మెట దెబ్బల్లా గంగమ్మ భావిస్తోంది కామోసు. ఘోష పెడుతోంది. తనని క్షమించమని మోలిండోని అర్థిస్తోంది. వాళ్ళు గంగనొదిలేసి వర్తమానంలోకి ప్రయాణిస్తున్నారు.

